## నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నందిగామ మైత్రిప్రియ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థలలో మెడికల్ కోడింగ్, ఫార్మసి అసిస్టెంట్, కాస్మటాలజీ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు బుధవారం 10.30 గంటలకు ఫొటోలు, సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 83284 28933లో సంప్రదించవచ్చు.

## నేడు గోల్కొండ కోటలో బోనాలపై సమీక్ష సమావేశం

గోల్కొండ: గోల్కొండ కోట శ్రీ జగదాంబ మహంకాళీ అమ్మవారి బోనాల ఏర్పాట్లపై నేడు గోల్కొండ కోటలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు తెలిపారు. జులై 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అమ్మవారి ఆషాఢ మాసం బోనాల ఏర్పాట్లపై జరుగుతున్న ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ, పోలీసులు, ఆర్అండ్‌బీ, టౌన్‌ప్లానింగ్, బల్దియా, జలమండలి, దేవాదాయ శాఖ, విద్యుత్, ఆరోగ్య శాఖ, జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు గోల్కొండ కోటలో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు.

# బోనాలు.. ఘటాలు.. వినూత్న విన్యాసాలు

- బోనాల్లో హైలెట్‌గా నిలవనున్న కళా ప్రదర్శనలు
- నెలరోజుల ముందుగానే కళాకారులకు ఆర్డర్లు
- ఘటాల ఊరేగింపులో వినూత్న తరహా శకటాలు
- వందలాది కళాకారులకు ప్రతి ఏడాది ఉపాధి


పులికళి నృత్యాలు


డప్పు వాయిద్యాలు

చార్మినార్: పాతబస్తీలో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల సందడి మొదలైంది. ఈసారి జరిగే బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఇప్పటికే తగిన ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాతబస్తీలో బోనాల సమర్పణ అనంతరం నిర్వహించే సామూహిక ఘటాల ఊరేగింపులో ప్రధాన పాత్ర వహించే శకటాలు, కళాకారుల విన్యాసాల ఏర్పాటు కోసం సంబంధిత ఉత్సవాల నిర్వాహకులు పెద్ద ఎత్తున కళాకారులకు ఆర్డర్స్ ఇస్తున్నారు.

### ఉత్సవాల్లో హైలెట్..కళాకారుల నృత్య ప్రదర్శనలు..

బోనాల ఉత్సవాల్లో కళాకారుల నృత్య ప్రదర్శనలు హైలెట్‌గా నిలుస్తాయి. తెలంగాణలో జరిగే బోనాల జాతర ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఎక్కువగా పాల్గొంటారు. ఉత్సవాల్లో వీరి ప్రదర్శనలకు ఎంతో ప్రజాదరణ ఉంది. ఉత్సవాల్లో కళాకారులు ప్రదర్శించే హావభావాలను చూసే ప్రతి భక్తుడు భక్తిపారవశంతో తన్మయత్వం పొందుతాడు. ఘట స్థాపన ఊరేగింపు, పోతరాజుల నృత్యాలు, అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు తదితర కార్యక్రమాల్లో వివిధ రూపాల్లోని కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరిస్తాయి.

బోనాల జాతర ఉత్సవాల్లో కళాకారుల నృత్య ప్రదర్శనలు లేకుండా ఉత్సవాలు ఉండవనే చెప్పాలి. ఘట స్థాపన ఊరేగింపుతో పాటు సామూహిక ఘటాల ఊరేగింపు రోజు కూడా కళాకారుల ప్రదర్శనలు హైలెట్‌గా నిలుస్తాయి.

### ఆసక్తిగా ఎదురు చూపులు..

వైభవంగా నిర్వహించే అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు ఉప్పుగూడ, బేలా, గౌలిపురా, శాలిబండ, కోట్ల అలీజా, మీరాలంమండి, కసరట్ట తదితర ప్రాంతాల నుంచి చార్మినార్ ద్వారా నయాపూల్‌లోని మూసి నది వరకు కొనసాగుతుంది. ఊరేగింపులో పాల్గొనే ఆలయం తరపున ఆకట్టుకునే సెట్టింగ్స్, విచిత్ర వేషధారణలతో పాల్గొనే కళాకారుల కోసం దారి పొడవునా వేచి ఉన్న భక్తులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తారు. ముఖ్యంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయానికి చెందిన వివిధ శకటాలు, విచిత్ర వేషధారణలోని కళాకారుల విన్యాసాల కోసం చార్మినార్ నుంచి నయాపూల్‌లోని ఢిల్లీ దర్వాజ వరకు భక్తులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తారు.

### ఈసారి పెద్ద ఎత్తున ఏర్పాట్లు..



ఈసారి జరిగే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం. పాత బస్తీలోని ప్రముఖ ఆలయాలకు చెందిన వివిధ రకాల శకటాలు, కళాకారుల బృందం నృత్యాలు.. ప్రతిసారి జరిగే బోనాల జాతర సామూహిక ఘటాల ఊరేగింపులో తమ ప్రత్యేకతను చాటుకుంటారు. – గాజుల అంజయ్య, ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్

### ఆకట్టుకునే వివిధ రూపాల్లో నృత్యాలు..

బోనాల జాతర ఊరేగింపు కేరళ పులికళి, భేరీ నృత్యం, గరిగెలు, బేతాళ నత్యం, ఒగ్గోళ్ల నృత్యం, బోనాలు, కాళికాదేవీ, లక్ష్మీదేవీ, వెంకటేశ్వర స్వామి, పొట్టి పోతరాజులు, సింహరథం, డప్పులోళ్లు, హనుమంతుడిలో రాముడు, దేవ నృత్యం, ఉరుములు, కొమ్ముకొయ్య, జడల కోలాటం, యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి శకటం.. అందులో ఏర్పాటు చేసే మూర్తులు, విజయవాడ కనక దర్గమ్మ ఆలయం రథం.. అందులో కొలువుదీరే అమ్మవారి వేషధారణలోని కళాకారుని హావ భావాలు.. ఇలా ఒకటేమిటి పలు రకాల శకటాలు, కళాకారుల నత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి.

## నేడు బోనాల ఏర్పాట్లపై సమీక్ష


గాజుల అంజయ్యను సన్మానిస్తున్న దృశ్యం

చార్మినార్: రాష్ట్ర ప్రభుత్వం ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల ఏర్పాట్ల కోసం బుధవారం ఉదయం ఉన్నతాధికారులు, ఉత్సవాల నిర్వాహకులతో కలిసి కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరగనుందని భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య తెలిపారు. బేగంపేట్‌లోని హరిత ప్లాజాలో ఉదయం 11 గంటలకు దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్, డిప్యూటీ మేయర్, అన్ని ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. కాగా, తెలంగాణ వారాల సంఘం ఆధ్వర్యంలోని గాజుల అంజయ్యను మంగళవారం మీరాలంమండిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ కొరిగింజ శ్రీరాములు, ముఖ్య సలహాదారులు గాజుల కృష్ణ, అధ్యక్షుడు గాజుల చంద్రశేఖర్, రమేష్, వెంకన్న, ప్రసాద్, కృష్ణ, రాంచందర్, రఘునంద, ముక్త కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

## 'రేపటి మైదానం' కవితా సంపుటి ఆవిష్కరణ



నాంపల్లి: కవి డాక్టర్ గోపి రచించిన 75 కవితల సంపుటి 'రేపటి మైదానం' ఆవిష్కరణ–అంకితోత్సవం సభ మంగళవారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ హాజరై కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ కృతిని సుప్రసిద్ధ విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య సూర్యా ధనంజయ, ప్రముఖ కవి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ విమర్శకుడు డాక్టర్ ఎస్.రఘు, ప్రముఖ రచయిత వంగల హర్షవర్ధన్, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురామ్ (కిన్నెర) తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవకు జీవితాంతం కృషి


చెక్కును అందజేస్తున్న ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: సమాజ సేవకు జీవితాంతం పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ముందుకు పోతామని తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. తన చిన్ననాటి మిత్రుడు రఘు అతని భార్య మృతి చెందడంతో అనాథ అయిన వారి కుమార్తె దివ్యకు చదువుతో పాటు వివాహం కూడా చేయిస్తామని ముజీబ్ హుస్సేని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..నిరంతరం సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుంటానన్నారు. ప్రతినెలా కొన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్. రాజ్‌కుమార్‌కుమార్, జిల్లా కార్యదర్శి విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి మృతి

విజయనగర్‌కాలనీ: ఆర్టీసీ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ గోరఖ్‌పూర్‌కు చెందిన సోను, వికాస్ జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం శంకర్‌పల్లిలో కూలీ పనులు ముగించుకుని రాత్రి మొఘల్‌కనాల మీదుగా కార్వాన్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వీరు కార్వాన్‌లోని రాంసింగ్‌పురా మీదుగా వెళ్తున్న సమయంలో వెనుకవైపు నుంచి ఆర్టీసీ బస్సు వచ్చి వీరి పక్క నుంచి వెళ్తూ వేగంగా కుడివైపునకు మళ్లింది. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సోను, వికాస్ అదుపుతప్పి కింద పడిపోయారు. సోను తలపై నుంచి ఆర్టీసీ బస్సు వెనుక చక్రాలు పోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వికాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ బస్సును ఆపకుండా అక్కడి నుంచి వెళ్లి పోయాడు. ఘటన స్థలానికి చేరుకున్న కుల్సుంపురా పోలీస్ డివిజన్ ఏసీపీ మునావర్, టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ రాములు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## గోల్కొండ బోనాలకు పూర్తి సహకారం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఈఓ శ్రీనివాసరాజు, సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాల నిర్వహణకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళీ ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు మంగళవారం ఎమ్మెల్యేను మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. బోనాల నిర్వహణపై నేడు జరగనున్న అధికారుల సమీక్షా సమావేశానికి రావాలని కోరుతూ ఆయనకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా గోల్కొండ కోట బోనాలు నిలుస్తు వస్తున్నాయని గతంలో కూడా తమ పార్టీ బోనాల విజయవంతానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించిందన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని బోనాలు జరిగే ఆలయాలకు గతంలో కంటే ఎక్కువ నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయనను కార్యనిర్వహణ అధికారి అమ్మవారి వృత్తిపని వార్ల సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారితో కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్.నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల నిర్వహణకు అందరి సహకారం అవసరం


గోల్కొండ డివిజన్ ఏసీపీని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: బోనాల నిర్వహణకు అందరి సహకారం అవసరమని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. దేవాదాయ శాఖ, అమ్మవారి భక్తులు, గోల్కొండ మహంకాళీ జగదాంబిక అమ్మవార్ల వృత్తిపని సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తాను మూడేళ్ల పాటు గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశానని ఆయా సమయంలో జరిగిన బోనాలను అందరి సహకారంతో విజయవంతమయ్యాయన్నారు. అయితే గతంలో కంటే ఈసారి బోనాల ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు, సమాజ సేవకులు ఎస్.రాజువస్తాద్, అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, బాబురావు, బీజేపీ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి, బంజారి దర్వాజ బాబురావు, మహంకాళీ ఆలయ పూజారి సురేష్‌చారి, వృత్తిపని సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## విజయవాడలో బోనాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి


ఈఓ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న గాజుల అంజయ్య బృందం

చార్మినార్: జులై 14న కనక దుర్గ అమ్మవారికి పట్టు వస్త్రాలతో పాటు బంగారు పాత్రలో నైవేద్యాన్ని (బోనం) సమర్పించనున్నామని, ఈ బోనాల జాతర ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఇంద్రకీలాద్రి దుర్గ గుడి ఈఓ రామారావును కోరినట్లు భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఈఓ రామారావును కలిసి వినతి పత్రం అందజేశామని మంగళవారం మీరాలంమండిలో విలేకరులకు తెలిపారు. ఇంద్రకీలాద్రి దుర్గ గుడి తరపున పాతబస్తీలో నిర్వహించే బోనాల ఉత్సవాల సందర్భంగా జులై 26న పాతబస్తీలోని అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించడానికి రావాలని కోరామన్నారు. జులై 14న నిర్వహించే బోనాల ఉత్సవాల్లో భాగంగా జులై 13వ తేదీన 100 మంది భక్తులు, కళాకారు లతో కలిసి నగరం నుంచి విజయవాడకు బయలు దేరనున్నామన్నారు. ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఉపాధ్యక్షుడు మధుసూదన్ యాదవ్, మజీ చైర్మన్ మధుసూదన్ గౌడ్ తదితరులున్నారు.

## 'కౌశిక్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి'


గౌరి సతీష్

అబిడ్స్: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ పేర్కొన్నారు. స్థాయికి మించి మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్ని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తన కార్యాలయంలో గౌరీ సతీష్ విలేకర్లతో మాట్లాడుతూ..నగర ఇన్‌చార్జ్ మంత్రిగా, రాష్ట్ర బీసీ మంత్రిగా, రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ గతంలో ఎవరూ చేయని విధంగా ప్రజాభివృద్ధి చేస్తూ బీసీల ఆకాంక్ష నెరవేరుస్తుంటే ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జీర్ణించుకోలేక ఆయనపై బజారు రౌడీగా ప్రకటనలు చేయడం దారుణమన్నారు. అసత్య ప్రచారాలు చేసిన కౌశిక్‌రెడ్డికి చట్టరీత్యా మంత్రి పొన్నం ప్రభాకర్ లీగల్ నోటీసులు పంపారని ఆయన అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కౌశిక్‌రెడ్డి, దిగజారుడు విధంగా వీడియోలు రిలీజ్ చేసి ప్రజలను మభ్యపెట్టి విజయం సాధించారన్నారు. ఆయన విజయం ఒక విజయమా..? అని ఆయన ప్రశ్నించారు. వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు క్షమాపణ చెప్పనిచో చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు.

## కత్తితో సంచరిస్తున్న వ్యక్తి రిమాండ్


జాదవ్ అభిషేక్

గౌలిపురా: కత్తితో సంచరిస్తున్న ఓ యువకున్ని మొఘల్‌పురా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 24న సాయంత్రం 5 గంటల సమయంలో లాల్‌దర్వాజా మోడ్ నాగులచింత సమీపంలో మొఘల్‌పురా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. కాగా అదే సమయంలో లాల్‌దర్వాజా బాలాగంజ్‌కు చెందిన బ్యాండ్ షాపులో పని చేసే జాదవ్ అభిషేక్ (23) అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడు. కాగా అభిషేక్‌ను అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా కత్తి లభించింది. దీంతో అతని అరెస్ట్ చేసి కత్తిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## భక్తిశ్రద్ధలతో ఈద్-ఏ-గదీర్


స్వీట్లు పంచుతున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: ఈద్-ఏ-గదీర్ పండుగను మంగళవారం పాతబస్తీలోని షియా ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా షియా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గులాం అబ్బాస్ కమిటీ ఆధ్వర్యంలో యాకుత్‌పురాలోని మౌలాకా చిల్లా వద్ద నుంచి నిర్వహించిన సెహ్రా ఊరేగింపులో బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులకు మిఠాయిలు పంచి పెట్టారు. మీర్జా హాషీం అలీ బేగ్, మౌలానా సయ్యద్ అలీ ఆగా బాక్రీ పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా సంచరించిన ఐదుగురికి జైలు

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వేళ రోడ్లపై అనుమానాస్పదంగా సంచరించిన ఐదుగురికి నాంపల్లి 9వ ప్రత్యేక మెట్రోపాలిటన్ న్యాయమూర్తి ఐదు రోజుల జైలు శిక్షను విధించింది. ఇన్‌స్పెక్టర్ కె.ఆదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా పరిసర బస్తీలకు చెందిన మహ్మద్ జాకీర్(28), షేక్ మోయిదుద్దీన్(26), ఎజాజ్ ఖాన్(28), మహ్మద్ ఆజం(28), మహ్మద్ ఆసిఫ్(35) సోమవారం అర్ధరాత్రి అనుమానాస్పద రీతిలో సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా ఐదు రోజుల రిమాండ్ విధించింది.

## 'వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు సరికాదు'


మాట్లాడుతున్న మఠం పీఠాధిపతి 1008 రాహుల్ దాస్ బాబా

లంగర్‌హౌస్: వాస్తవాలు తెలుసుకోకుండా ఆలయంపై చాడ వెంకటరెడ్డి ఆరోపణలు చేయడం సరికాదని శ్రీ రామచంద్ర జీ మఠంపీఠాధిపతులు 1008 రాహుల్ దాస్ బాబా అన్నారు. లంగర్‌హౌస్ బాపూఘట్ భూములను సంఘం ఆలయం వారు ఆక్రమిస్తున్నట్లు ఆరోపిస్తూ వెంకటరెడ్డి ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు వార్త రావడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పర్యాటక శాఖలు, మహాత్మా గాంధీ వీరంతా ఈ మధ్య కాలంలోనే వచ్చిన వారన్నారు. కానీ ఇక్కడ ఉన్న సంఘం పంచముఖ ఆంజనేయ స్వామికి 800 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. చాడ వెంకటరెడ్డి తెలిపిన సర్వే నెంబర్లలో తమ భూమి లేదు అని వేరొక సర్వే నెంబర్‌లో తమకు సంబంధించిన రెండు ఎకరాల ఏడు గుంటలకు ఉందన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో కూడా నేటికి తమ పూర్వీక బాప కల్యాణ్ దాస్ బాబా పేరుపైనే ఉందన్నారు. ఈ విషయాన్ని దేవాదాయ శాఖ కూడా గుర్తించి తమకు మద్దతుగా కోర్టులో కేసు వేసిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. చాడ వెంకటరెడ్డి ఇప్పటికైనా ఇక్కడికి వచ్చి వాస్తవాలు పరిశీలించి నిజానిజాలు తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, మాతంగి రమేష్, నాగేంద్ర, ప్రకాష్‌రెడ్డి, లింగారెడ్డి, పాండు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


ఏరియా ఆసుపత్రి ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

నాంపల్లి: హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం మంగళవారం నాంపల్లి ఏరియా ఆసుపత్రిని సందర్శించింది. ప్రధానమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రజారోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల డయాగ్నొస్టిక్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో ఐదు రోజులుగా రక్త పరీక్ష సేవలు ఆన్‌లైన్ ఎర్రర్ కారణంగా అందుబాటులో లేవని, దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ షేక్ మహమూద్, జిల్లా కార్యవర్గ సభ్యులు మాజిద్ అలీ ఖాన్, కల్యాణ్, బాలు, విజయ్, వంశీ, సీనియర్ కార్మిక నేత చెట్టుకింద శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యారంగ వ్యాప్తికి ప్రత్యేక కృషి


విద్యార్థులకు రశీదును అందజేస్తున్న ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: విద్యారంగ వ్యాప్తికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో పేద విద్యార్థులకు విద్యా దీవెన కానుక ద్వారా స్వయంగా ఆశీష్‌కుమార్ యాదవ్ ఫీజులు చెల్లించి రశీదులు అందజేశారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో పేద విద్యార్థులకు అండగా ఉంటానన్నారు. నియోజకవర్గంలోని పేద బడుగు వర్గాల కోసం విద్యా దీవెన కానుక పథకాన్ని ఏర్పాటు చేశామన్నారు. తానే స్వయంగా ఫీజులు చెల్లించి వారికి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశంతో గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా బీఆర్ఎస్‌ను పటిష్టం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## 'బోనాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం'


మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్ గౌడ్

దూద్‌బౌలి: బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఉత్సవాల నిర్వాహకులతో పాటు జీహెచ్ఎంసీ బహదూర్‌పురా సర్కిల్–10 డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులతో కలిసి మంగళవారం బహదూర్‌పురా మండల కార్యాలయం ప్రాంగణంలో కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు బోనాల పండుగ కోసం సమన్వయంతో పని చేయనున్నారన్నారు. తాగునీటి సరఫరాతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా, డ్రైనేజీ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే.. సంబంధిత అధికారులతో చర్చించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## డివిజన్ అభివృద్ధికి నిరంతర కృషి


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. కృష్ణారెడ్డినగర్‌లో మంగళవారం నూతనంగా ఎస్‌డబ్ల్యూ డ్రైన్ పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..కృష్ణారెడ్డి నగర్‌లో కచ్చా మోరీ పైప్‌లైన్ శిథిలావస్థకు చేరుకోవడంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తాము సమస్యను జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రూ.11.50 లక్షల నిధులను మంజూరు చేయడంతో పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆదర్ల మహేశ్, కృష్ణారెడ్డినగర్ బస్తీ మహిళలు అండాలమ్మ, కె.లలితమ్మ, జి.సత్యమ్మ, కౌసల్య, భాగ్య, విజయమ్మ పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, తహసీల్దార్, ప్రేమ్‌కుమార్

అబిడ్స్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. నాంపల్లి మండలంలోని అర్హులైన 200 మంది కల్యాణలక్ష్మి, 135 షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ..ప్రజలు ఎవరైనా ధూల్‌పేట్‌లోని తన కార్యాలయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా సంప్రదిస్తే వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భీశ్వ సురేఖ, రాకేష్ జైస్వాల్, లాల్‌సింగ్‌లతో పాటు తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.